కథ

# మనసు పడ్డాను కానీ...

విరించి

**అంత అందమైన నవ్వు నేను బుద్ధి ఎరిగాక ఎపుడూ చూడలేదు. ఓ సెలయేరులా, హరివిల్లులా, చిరుజల్లులా, మెరుపులా, మలయమారుతంలా, కోకిలగానంలా, పున్నమివెన్నెల్లా, విరిసీవిరియని పువ్వుల్లా, ఎగిరేగువ్వలా ఎంత అందంగా ఉంది? ఆ నవ్వు?. ఎంత హాయిగా ఉంది? ఆ నవ్వును చూస్తూ బ్రతికేయచ్చు. ఆ నవ్వును చూస్తూ మరణించొచ్చు. ఆ నవ్వులో ఆ గొప్పతనం ఉంది - అంత మాధుర్యం ఉంది. అంత సహజత్వం ఉంది. అంత స్వచ్ఛత ఉంది.**

ఆ నవ్వును మొట్టమొదటి సారి చూసిన క్షణం.. ఓ అద్భుతాన్ని వీక్షించిన క్షణం.. ఎపుడూ నా కళ్లముందు కదలాడుతూనే ఉంటుంది. అను క్షణం నన్ను వెంటాడుతూనే ఉంటుంది.

సరిగ్గా మూడేళ్ళక్రితం నన్ను విశాఖపట్నం నుంచి ఖమ్మం జిల్లాకు ట్రాన్స్ఫర్ చేసారు. అప్పట్కేనేను ఆంధ్ర, రాయలసీమ, హైద్రాబాద్ సిటీలు ఓ సారి చుట్టి రావడమైంది. ఈసారి ఫామిలీ పెట్టదలచుకోలేదు. వినీల్, శ్రావణిల చదువు డిస్టర్బ్ కావడం నాకు ఇష్టం లేదు. జాయిన్ అయ్యి ఎలాగోలా ప్రయత్నం చేసుకొని మళ్ళీ విశాఖపట్నం వచ్చేయాలని నా ఆలోచన.

మా డిస్ట్రిక్ట్ ఆఫీస్‌లో జాయిన్ అయి చార్జి తీసుకొని నెలయ్యింది. ఆ రోజు చాలా బిజీగా ఉన్నాను. మా అసిస్టెంటు అహ్మద్ అన్ని పన్లు తనే చేసుకుంటాడు. నా పని వెరిఫై చేసి సంతకాలు పెట్టడమే. సరిగ్గా మధ్యాహ్నం ఒకటిన్నర అయ్యింది. ఆకాశం మేఘావృతమైంది. ఈదురుగాలులు వీల వీస్తున్నాయి. సన్నగా జల్లులు ప్రారంభమై క్రమంగా కుంభవృష్టి కురుస్తోంది. ఉరుములు, మెరుపులతో ఆకాశం దద్దరిల్లుతోంది. లంచ్‌కు కూర్చుందామని హాట్ క్యారియర్ విప్పుతూంటే ఓ మెరుపు మెరిసినట్లయింది. సన్నగా, పొడవుగా ఉన్న ఓ యువతి వడివడిగా మా ఆఫీస్‌లో కొచ్చింది. వర్షంలో తడిసిన మొహాన్ని పమిటి చెంగుతో తుడుచుకుంటూంది. ఆటోలో వచ్చినట్లుంది ఆటో వాడికి డబ్బులిస్తోంది. అహ్మద్ ఆమెను పలకరిస్తున్నాడు. రెండు నిముషాలు తర్వాత ఇద్దరు కల్సి నా క్యాబిన్ వైపే వస్తున్నారు. నేను వాళ్లని గమనించనట్లు నటిస్తూ క్యారేజీ సర్దుకుంటున్నాను.

''నమస్తే!'' కోటిరాగాలు మీటినట్లయి తలెత్తి చూసా ఆమె.. అద్భుత సౌందర్యవతి. ముప్పైఆరు, ముప్పైఏడు ఏళ్లుండవచ్చు. సన్నగా, పొడవుగా, బంగారు మేని ఛాయ.. అంతకు మించి అద్భుతమైన ఆమె చిరునవ్వు. ఆమె నా కేసి పలకరింపుగా నవ్వుతోంది. అంత అందమైన నవ్వు నేనెపుడూ చూడలేదు.

''న..మ..స్తే'' నాకు నోట మాటరాలేదు.

''మా కొత్తసార్. వేణుగోపాల్.. ఈమె సుహాసిని.. సోషల్‌వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్'' అహ్మద్ పరిచయం చేస్తున్నాడు.

ఓ సౌందర్యోపాసకుడిలా ఆమె అందాన్ని, చిరునవ్వును ఆస్వాదిస్తున్నా.

అహ్మద్ చెప్పేది నాకేం వినపడటంలేదు.

''సార్!'' అహ్మద్ పిలిచాడు. అప్పుడుగానీ ఈలోకంలోకి రాలేదు.

''కూర్చోండి'' అన్నాను.

''సారీ! మీ లంచ్‌టైంలో వచ్చాను''. నవ్వుతూనే కూర్చుందామె.

''ఇట్స్ ఓ కె! మీరు భోజనం చేసారా?''

''లేదు సార్! బ్యాగ్‌లో బాక్స్ ఉంది మా ఆఫీసు కెళ్ళి చేస్తా'' ''మీ స్పెషల్స్ మేం తినకూడదా?'' అన్నాను. ఆమెను ఎపుడో, ఎక్కడో చూసినట్లు, ఎన్నాళ్ళనుంచో పరిచయం ఉన్నట్లు అన్పిస్తోంది. ఆ నవ్వు, మాట్లాడే తీరు నన్నెంతో ఆకర్షించింది. ఆమెను అలాగే చూడాలన్పిస్తోంది. ఆమె పని త్వరగా ముగించి పంపడం నాకిష్టంలేదు. ఆమె వచ్చిన పని అడిగితే, ఆపని అవగానే ఆమె వెళ్లిపోవచ్చు. మళ్లీరాక పోవచ్చు.

''కూడదు.. అనికాదు. తినగలరా?'' అంది.

''ఇక్కడ్కి వచ్చినప్పట్నుంచి హోటల్ కూడు తిని జిహ్వ చచ్చిపోయింది. మీ పుణ్యమా అని ఇంటి భోజనం చేస్తే కొంత కాలం బ్రతకొచ్చని ఆశ''.

''అంత కష్టం ఎందుకు? ఫామిలీ పుటప్ చెయ్యొచ్చుగా?'' ఏం చెప్పాలి? పెళ్లి కాలేదు అని చెప్పనా? ఆమెకు కూడా పెళ్లి కాకపోతే ఎంత బాగుండును. అయినా, ఇంత వయస్సు దాకా పెళ్ళి కాకుండా ఎవరుంటారు? అబద్ధం ఆడినా అతికినట్లుండాలి. అక్కడక్కడ నెరిసినజుట్టు, నావయస్సును తెలియజేస్తూనే ఉంది.

''పుటప్ చెయొచ్చు. మీరుండేది ఎక్కడ?''

''మామిళ్ళగూడెం''


''మాక్కూడా ఓ ఇల్లు చూడొచ్చుగా?'' టక్కున అన్నాను. నిజాన్కి నాకు ఫామిలీ పెట్టే ఉద్దేశం లేదు.

''తప్పకుండా'' అంది.

అటెండరను పిలిచి మరో మీల్స్‌ప్లేట్ తెమ్మన్నాను.

''ఎందుకు సార్! నేను భోజనం చెయ్యను'' అంది సుహాసిని.

''మా లాంటి సామాన్యులతో చెయ్యరా?'' అన్నాను అదో పెద్దజోక్ అన్నట్లు అయినా సుహాసిని నవ్వింది. ఆనవ్వు కోసమే నేను కాచుకూర్చున్నాను.



**Story**

అటెండర్ ప్లేట్ తేగానే కారియర్ తెరిచి ఇద్దర్కివడ్డించా. ఆమె బాక్స్ ఓపెన్ చేసింది. దాంట్లో ఉన్నది పులిహార, చక్రపొంగలి.

''మీకు స్వంత గుళ్ళు గోపురాలు ఉన్నాయా?'' అన్నాను.

''ఫ్యాక్టరీలు, వ్యాపారాల్లా సొంత గుళ్ళుగోపురాలు ఉంటాయా'' అంది కిసుక్కుననవ్వుతూ.

''మరి.. సాధారణంగా.. పులిహార, చక్రపొంగలి..''


''మా ఇంటి ప్రక్కన వెంకటేశ్వరస్వామి గుడి ఉంది. పూజారి మా బాబాయి, ఈరోజు శనివారం కదాని గుడి కెళ్తే 'అమ్మాయీ ప్రసాదం తీసుకెళ్ళ'ని ఇచ్చాడు'' అంది.

''అయితే, మిమ్మల్ని పట్టుకుంటే మంచి ప్రసాదం దొరుకుతుందన్నమాట''

ఆమెను వదలాలన్పించడంలేదు. ఏదో కల్పించుకుని మాట్లాడుతున్నాడు. ఆమె వచ్చిన పని చెప్పడాన్కి ప్రయత్నిస్తూంది. నేను వినేస్థితిలోలేను. హోటల్ కూడు, ప్రసాదం కల్పి ఇద్దరం లంచ్ కానిచ్చాం. ఆమె ''థ్యాంక్స్'' చెప్పింది.

''యు ఆర్ మోస్ట్ వెల్‌కం'' అన్నాను.

ఆమె వచ్చిన పనిచెప్పింది. వాళ్ల డిపార్ట్‌మెంటుకు మా దగ్గర నుంచి 'రైస్' డ్రా చెప్పారు. దాని రిలీజ్ ఆర్డర్ కోసం వచ్చిందామె. తనే 'ఒక్క నిముషం' అంటూ ఏదో వంకన ఆపుతున్నాడు. ఆమె ఉన్నంతసేపు చిరునవ్వు మొహం మీద చెరగనివ్వలేదు.



ఇక, ఆమెకు వెళ్లడాన్కి లేవక తప్పలేదు. ఆమె ఫోన్ నెంబరు చెప్తేబాగుండును.

''ఏదైనా అవసరమైతే, మిమ్మల్ని కాంటాక్ట్ చెయ్యాలంటే..''

''అంత అవసరం ఉండదు. నెలకోసారి నేను వస్తా. అంతగా అవసరం అయితే అహ్మద్‌గార్కి నానెంబర్ తెల్సు'' అంది.

రెండు చేతులు జోడించి నమస్కారం పెట్టిబయల్దేరిందామె. అప్పటి దాకా ఉన్న వెలుగు ఒక్కసారి మాయమయి, చీకట్లు క్రమ్ముకున్నట్లు వీధి గుమ్మం దాకా వెళ్ళి సాగనంపుదామా అన్పించింది. స్టాఫ్ ముందు పలచన అవడం ఇష్టం లేక మానేశాడు.

ఒక్కసారిగా నన్ను నీరసం, నిస్సత్తువ ఆవరించాయి. నాలో శక్తి అంతా తనతో తీసుకుపోయినట్లు అన్పించింది. ఆరోజు ఇంక పని చేయబుద్ధి కాలేదు.

అలా ఓ నాల్గు రోజులు గడిచాయి. ఆనాల్గు రోజులూ నిద్రలేని రాత్రులే. కళ్ళు మూసినా తెరిచినా ఆ మోము, ఆనవ్వు కన్పిస్తున్నాయి. ఇక లాభం లేదనుకుని అహ్మద్‌ను పిలిచాను.

''మొన్నామధ్య వచ్చిన మేడమ్.. ఆవిడ పేరేమిటి?.. సుహాసిని కదూ! ఆవిడ ఫోన్ నెంబర్ కావాలోయ్'' అన్నాను.

అహ్మద్ సంస్కారవంతుడు. 'ఎందుకు' అని అడగకుండా వెంటనే సెల్ నెంబర్ ఇచ్చాడు. సెల్ డయల్ చేసాను కానీ.. 'ఆన్' నొక్కాలంటే సందిగ్ధంగా ఉంది. ఫోన్‌చేసి ఏం మాట్లాడాలి? నేను తప్పు చేస్తున్నానా? పెళ్ళయి పెళ్లాం పిల్లలున్న వాడ్ని పరాయి స్త్రీ మీద మనసు పడటం ఏమిటి? ఇదెక్కడకు దారి తీస్తుంది? తనెందుకు ఫోన్ చేస్తున్నాడు? ఆమె అపార్థం చేసుకుంటే? ఈ సందేహాలన్నీ ఆమె ఆకర్షణముందు బలాదూర్. సెల్ ఆన్‌చేసా. రింగ్ అయ్యింది కానీ లిఫ్ట్ చెయ్యలేదు. పదినిముషాల తర్వాత.

''హలో! ఈ నెంబర్ ఎవరిదండీ? మిస్డ్ కాల్ ఉంది'' అంటూ తర్వాత తనే చేసింది.

''సుహాసిని గారా?'' అన్నాను. ఎందుకో కొంచెం టెన్షన్‌గానే ఉంది.

''అవునండీ. మీరు?''

''నన్ను గుర్తుపట్టలేదా? నేనండీ.. నేను''

''వేణుగోపాల్‌గారు. అవునా?''

''ఫెన్‌టాస్టిక్. భలేగుర్తు పట్టారే?'' అన్నాను ఆశ్చర్యంగా.

''మీరు చేస్తారని ఎక్స్‌పెక్ట్ చేసా'' అంది.

''ఎలా?'' అన్నా.

''తాయత్తుమహిమ'' అంది నవ్వుతూ.

''నిజం చెప్పండి''

''మీ మాటతీరు, మంచితనం నాకు నచ్చాయి. మొదటి పరిచయంలోనే ఎంతో బాగా మాట్లాడారు. అన్నదాత అయ్యారు''

''భలే వారే! అంత మాత్రాన్కే అన్నదాతనా?'' అన్నాను.

''సరే! ఇంతకీ ఏమిటి విశేషం.''

''ఏం లేదు. ఊరికే.. ఎందుకో మీకు చెయ్యాలన్పించింది'' అన్నాను.

ఆ తర్వాత ఓ పదినిముషాలు మాట్లాడాం. ఏం మాట్లాడానో నాకే తెలియదు. మధ్యమధ్యలో నా జోక్స్‌కు సుహాసిని నవ్వుతూనే ఉంది. ఆ నవ్వుల జల్లులో నేను తడిసి ముద్దయ్యాను. ఆమె నవ్వుతుంటే ఎంతో హాయిగా ఉంది.

సరిగ్గా నెల్లాళ్ళకు మళ్లీ ఆమె వచ్చింది. మళ్లీ అదే పని. ఈసారి చాలా అటెన్షన్‌గా ఉన్నాను. రాగానే డ్రింక్స్ తెప్పించాను. నా వ్యక్తిగత విషయాలు చెప్పా. తన విషయాలు అడిగా. ఆమెకు ఇద్దరు ఆడపిల్లలు. ఇద్దరూ కాలేజీలో చదువుతున్నారు. భర్త పోతే ఆ ఉద్యోగం ఆమెకిచ్చారు.

ఈసారి తను నా ఫోన్ నెంబరు తీసుకుంది. కానీ, తనకుగా తనెప్పుడు ఫోన్ చెయ్యలేదు. నేను చేసి మాట్లాడటమేగానీ, అలా ఆరు నెలలు గడిచాయి. మామధ్య స్నేహం బాగా పెరిగింది. మొదట్లో పది, పదిహేను రోజులకోసారి మాట్లాడే వాడ్ని. ఇప్పుడు రెండు మూడు రోజులకోసారి ఫోన్ చేస్తున్నా. వారం వారం మా ఊరు వెళ్లొస్తూనే ఉన్నా. కానీ, సుహాసినిని మాత్రం మర్చిపోలేక పోతున్నా. ఆమె మాట తీరు, వ్యక్తిత్వం పట్ల నాకు గౌరవం ఏర్పడింది. ఆమెకూడా నన్ను బాగానే అభిమానిస్తుంది అనుకుంటూ, అలా సంవత్సరం గడిచింది. మా మధ్య సాన్నిహిత్యం మరింత పెరిగింది. నేనంటే నమ్మకం, గౌరవం బాగా ఏర్పడ్డాయి. ఆ తర్వాత రోజుకు ఒక్కసార

యినా ఫోన్లో మాట్లాడుకోనిదే నిద్ర పోవడం లేదు. రోజూ మాట్లాడుకునే సమయం కూడా నిముషాల్లోంచి గంటల్లోకి మారింది. ఆమె తన అంతరంగిక విషయాలు చాలా చెప్పింది. ఆమె స్నేహాన్ని మించి నా మనస్సు మరేదో కోరుతోంది. అదేదో నాకే స్పష్టంగా తెలియదు. ఆమెకెలా చెప్పాలి? రోజులు, నెలలూ గడిచి పోతున్నాయి. నా ట్రాన్స్‌ఫర్ ప్రయత్నాలు కూడా మందగించాయి. రోజూ ప్రతిక్షణం ఆమె ఆలోచన్లే. ఆ ఆలోచనల్లోంచి బయటపడ్డం చాలా కష్టంగా ఉంది. 'నాకు ఆమె కావాలి' అన్పిస్తోంది. అంటే ఏమిటో నాకే అర్థం కావట్లేదు. ఆమెను నేను ప్రేమిస్తున్నానా ప్రేమంటే ఏమిటి? ఇది ప్రేమించే వయస్సేనా? ప్రేమకు ఓ వయస్సంటూ ఉందా? సుహాసిని నా గురించి ఏమనుకుంటూంది? తనకీ నేనంటే ఇష్టమేనా? అన్నీ జవాబులు లేని ప్రశ్నలు.

ఓ రోజు సడన్‌గా నాకు ట్రాన్స్‌ఫర్ ఆర్డర్స్ వచ్చాయి. మళ్లీ మా ఊరుకే. అహ్మద్ వచ్చి కంగ్రాట్యులేషన్స్ చెప్పాడు. నాకే మాత్రం ఆనందంగా లేదు. పైపెచ్చు దిగులుగా ఉంది. వెంటనే సుహాసినికి ఫోన్ చేసాను.

''హలో! సుహాసిని! నాకు ట్రాన్స్‌ఫర్ ఆర్డర్స్ వచ్చాయి. మా ఊరికే'' అన్నాను ఆందోళనగా.

''కంగ్రాట్యులేషన్'' అంది సుహాసిని నవ్వుతూ.

''ఎందుకు? నే వెళ్లిపోవడం నీకు అంత ఇష్టమా?'' అప్పటిదాకా మీరు అనేవాడిని నాకు తెలియకుండానే 'నువ్వు' అన్నాను. సుహాసిని అదేం పట్టించుకున్నట్లు లేదు.''అదేమిటండీ? మీ పెళ్లాం పిల్లల దగ్గరకు మీరెళుతున్నారు. ఆనందమే కదా!'' అంది.

''సరే! నేనంటే నీ అభిప్రాయం ఏమిటి?''

''మంచివారు''

''అంతేనా?''

''సంస్కారవంతులు''

''అబ్బా! అంతకంటే ఏం కాదా? సరే, ఈరోజు సాయంత్రం మీ ఇంటికి పిల్చి ఓ కప్పు కాఫీ ఇవ్వచ్చుగా'' అన్నాను. ఇక ముందుకు ప్రొసీడ్ అవ్వాలి. లేకపోతే చేజారి పోయేట్లుంది వ్యవహారం.

''తప్పకుండా, కాఫీ కేం ఖర్మ. భోజనాన్కిరండి'' అంది.

''థాంక్స్'' అన్నాను.

ఈరోజు ఎలాగైనా మనస్సులో మాట చెప్పాలనుకున్నా. త్వరత్వరగా ఆఫీసు పని ముగించుకొని, రూం కెళ్లి ఫ్రెషప్ అయి, ట్రిమ్‌గా సుహాసిని ఇల్లు వెతుక్కుంటూ వెళ్లా. వచ్చే ముందు ఫోన్ చెయ్యడంతో సుహాసిని గుమ్మంలో ఎదురుచూస్తోంది. దారిలో కొన్న స్వీట్లు, పండ్లు, పూలు చేతికిచ్చాను. చిర్నవ్వుతో ''స్వాగతం మహాశయ'' అంది.

ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌లో చేసిన రంగురంగుల రాధా కృష్ణుల బొమ్మ టేబిల్ మీద పెట్టాను.

''సో క్యూట్ థ్యాంక్యూ'' అంది.

ఇల్లు చిన్నదే కానీ ఎంతో నీటుగా ఉంది. నాలుగు గదుల ఇల్లది. ఓ బెడ్‌రూంలోకి తీసుకెళ్ళి వాళ్ల అమ్మగార్కి పరిచయం చేసింది. ఆమె కాళ్లకు నమస్కారం పెట్టాను. కూతుళ్లిద్దర్కి ''వేణు అంకుల్ అని చెప్పానే ఈయనే'' అని పరిచయం చేసింది. ఇద్దరు పిల్లలూ ముద్దొస్తున్నారు. వాళ్లు రెండో బెడ్‌రూంలో చదువుకుంటున్నారు. కాసేపు కబుర్లయాక భోజనం చేసాం. మళ్లీ హాల్లో కొచ్చి కూర్చున్నాం. ''సుహాసినీ! నిజం చెప్పు. నేను వెళ్లడం నీకు ఇష్టమేనా?'' అన్నాను. సుహాసిని ఓ క్షణం మాట్లాడలేదు. ''నేను వద్దంటే మీరు మానేస్తారా?'' అంది. ''తప్పకుండా'' అన్నాను. ఆమాట నాకే అసహజంగా అన్పించింది.

''ఎందుకు?''

''నీకోసం''

''అదే.. ఎందుకోసం?'' అని రెట్టించింది.

''నువ్వంటే.. నాకు ఇష్టం'' ఈసారి కొంచెం ధైర్యం చేసా.

''ఇష్టం అంటే?''

''నువ్వు నాకు కావాలి''

''అంటే?''

''నాకు.. నాకు.. నేను...నేను... ఐలవ్‌యూ'' అన్నాను ఠక్కున. నా భార్యకు కాకుండా మరోస్త్రీకి 'ఐలవ్‌యూ' చెప్పడం ఇదే మొదటిసారి. కిసుక్కున నవ్వింది సుహాసిని. అలా ఐదు నిముషాలు నవ్వుతూనే ఉంది. మామూలు సమయంలోనైతే ఆన నవ్వును ఆస్వాదించే వాడ్ని. కానీ, ఇప్పుడు టెన్షన్‌గా ఉంది. 'గెటౌట్' అనలేదు.. సంతోషం.

''ప్రేమంటే తెల్సా మీకు?'' అంది నవ్వును ఆపుకుంటూ. ''పోనీ.. నన్ను పెళ్లిచేస్కుంటారా?''

ఏం చెప్పాలో తెలియలేదు''

''ఈ మాట అన్నవాళ్ళలో మీరు ఏడోవారు. ఆ ఆరుగురిలో ఐదుగురు పెళ్ళైన వాళ్ళే. నరేష్, నారాయణ, శ్రీనివాస్, వెంకట్, వంశీ, మధు.. అంతా ఇదే డైలాగ్. విని విని విసుగెత్తిపోయా. అంతా నా శరీరాన్ని కోరుకునే వాళ్ళే. నన్ను నన్నుగా ప్రేమించే వాళ్ళు కాదు.'' ఒక్క క్షణం ఆగి మళ్ళీ అంది.

''నన్ను జీవితాంతం మీరు చూస్తారా? మీ భార్య బిడ్డల్ని వదిలి మీరు రాగలరా? మీ భార్యకు విడాకులివ్వగలరా?'' సూటిగా అడిగింది సుహాసిని.

ఏం చెప్పాలో అర్థం కాలేదు. ఏం చెప్పినా కృత్రిమంగానే అన్పిస్తోంది. కానీ, నిశ్చయంగా ఏదోచెప్పాలి. లేకపోతే ఆమె ముందు ఓడిపోయేటట్లున్నాను.

''తప్పకుండా నిన్ను పెళ్లిచేస్కుంటా. అందుకు నా భార్యకు విడాకులు ఇవ్వవల్సిన పనిలేదు'' అన్నాను. నా మాట నాకే నమ్మకంగా లేదు. పైగా, కన్ఫ్యూజన్‌గా ఉంది.

''అంటే... నన్ను సెకండ్ సెటప్‌గా..''

''ఛ... అదేం మాట?'' అన్నాను.

''అలా అయితే ఏనాడో ఎవరో ఒకళ్ళకి అంగీకరించేదాన్ని. నాకూ వ్యక్తిత్వం ఉంది. నాకు నీతి నియమం ఉంది. మీరు ఎంతో సంస్కార వంతులు, మీకు నా హృదయంలో మిగతా వాళ్ళకంటే గొప్పస్థానం ఉంది. మీరు నన్నలా అడగడంలో తప్పుందని నేను అనడం లేదు. ఇంత కాలం మన స్నేహంలో మీరెప్పుడు మీ పరిధిని దాటలేదు. అసభ్యంగా ప్రవర్తించలేదు. నిజానికి మీతో జీవితాన్ని పంచుకోడానికి నేను అదృష్టంగా భావిస్తా. కానీ, ఈ కట్టుబాట్ల సంకెళ్ళలోంచి అంత ఈజీగా బయటపడలేను. నిజం చెప్పాలంటే మీరన్న 'ఐలవ్‌యూ' నేను మిమ్మల్ని ఉద్దేశించి ఎన్నోసార్లు అనుకున్నా. కానీ, తెగించి చెప్పడానికి మనం పుట్టింది పవిత్ర భారతదేశంలో కదా!'' అంది.

''నిజానికి వేణు! ఈ రెండు సంవత్సరాల్లో ఎంతో దగ్గరయ్యాం. నీకు నాకు మధ్య ఏ దాపరికం లేదు. ఇంతకు ముందు ఎవరెవరు నాతో ఎలా ప్రవర్తించారో, నేను ఎంత ఇబ్బంది పడ్డానో అన్నీ నీకు చెప్పాను. నాకు ఎన్నో మంచి సలహాలిచ్చావు. ఎవ్వరికి గట్టిగా 'నో' అని చెప్పి శత్రువుల్ని చేసుకునే పరిస్థితి కాదు నాది. మగ దిక్కులేని ఆడదంటే ప్రతిమగాడికి అలుసే. నువ్వా ఉద్దేశ్యంతో అన్నావని నేనను. నువ్వంటే నాకు చాలా ఇష్టం. ఐలవ్‌యూ వేణు! మన ప్రేమకు శరీరాలు దగ్గరకానక్కర్లేదు. ఓ చిరునవ్వుచాలు. చిన్న పలకరింపు చాలు. ఒకరస్పర్శ చాలు. నువ్వు పీల్చివదిలిన గాలి నన్ను తాకితే చాలు. ''రామ పాదం తాకిన రాయిలా పరవశించి పోతాను.'' ఈసారి సుహాసిని మొహంలో నవ్వు మాయం అయింది. కళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరుగుతున్నాయి. ఆనందం, విచారం కల్సిన మిశ్రమ భావాలతో ఉంది. రెండు కళ్ళ నుంచి రెండు చుక్కలు జలజల రాలాయి. మొట్ట మొదటి సారి నన్ను 'నువ్వు' అని సంభోదించింది అపుడే.

''ఛ సుహా!'' అని నా కుడిచేతి చూపుడు వేలితో ఆమె బుగ్గలపై కన్నీటిని తుడిచాను.

''సారీ!'' అంటూ చటుక్కున లేచి నుంచుంది.

''సారీ నేను చెప్పాలి. నీ మనస్సు కష్టపెట్టాను'' అన్నాను. ''లేదు వేణు! ఎప్పుడూ అందరి ముందు 'నవ్వు'నటించే నేను నా గుండెల్లో బాధ ఎవరికి చెప్పుకోను? భర్తను పోగొట్టుకున్న నేను నవ్వడం కూడా అందరిదృష్టిలో నేరమే. ఎవ్వరితో మాట్లాడినా వాళ్లతో కథలల్లి బురద జల్లే వాళ్ళే. ఒక్కోసారి చచ్చిపోవాలనిపిస్తుంది వేణు''. అమ్మ, పిల్లల కోసం బ్రతకక్కతప్పదు.''

సన్నివేశం గంభీరంగా తయారయ్యింది, నాకేం మాట్లాడాలో తెలియడం లేదు.

''వేణు! ఒక్కసారి కళ్లు మూసుకో'' అంది.

''ఎందుకు?''

''చెప్తా''

కళ్లు మూసుకున్నా ఆమె అడుగుల చప్పుడు దగ్గరగా విన్పిస్తోంది. చటుక్కున ఆమె నా నొదటి మీద ముద్దు పెట్టుకుంది. నేను తన్మయత్వంలో మరో ముద్దు కోసం కళ్లు మూసుకునే ఉన్నా.

''ఓ.కె. వేణు! మనం మంచి మిత్రులం. జీవితాంతం గుడ్ ఫ్రెండ్స్. నీ స్థానం ఎవరూ ఆక్రమించలేరు. మరో మగాడికి స్థానమే లేదు. సరేనా? చాలా ప్రొద్దు పోయింది. గుడ్‌నైట్'' అంటూ చెయ్యి చాపింది.

ఆమె చెయ్యి అప్రయత్నంగా మృదువుగా నొక్కా. పాణిగ్రహణం అంటే ఇదేనా? చెయ్యి వదలబుద్ధికాలేదు.

ఆమె సున్నితంగా చెయ్యితీసుకుంది. గేటు దాకా నన్ను తీసుకొచ్చి ''బై.. వేణు!, రోజూ ఫోన్ చెయ్యి'' అంది. ''చేస్తా. గంట గంటకు చేస్తా. ప్రతీసారి గంట మాట్లాడ్తా'' అన్నాను. నవ్వడానికి ప్రయత్నించాను. మనస్సు సహకరించలేదు.

''గుడ్‌నైట్ వేణు'' ఆమె చెయ్యి ఊపుతోంది.

''గుడ్‌నైట్'' గిరుక్కున తిరిగి కన్నీళ్లు తుడుచుకున్నా. ప్రేమంటే కేవలం మనస్సుకు సంబంధించిందనీ, శరీరసుఖానికి సంబంధం లేదని మొట్టమొదటి సారి అర్థమయ్యింది. మనసుపడ్డాను.. కానీ.. మదికి చేరువైనా మనిషికి చేరువకాలేక పోయా. నేటికీ సుహాసినికి నా మనస్సులో ఓ ప్రత్యేక స్థానం ఉంది ఉంటుంది. నా రక్తం ఎర్రగా ఉన్నంత వరకు.

*